క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, తదితరులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌ను చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించారు. గురుద్వార్ దరి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీఆర్సీ కమిషన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పి.వెంకటరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు, ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కరరావు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులే ప్రజా సేవకులు


పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న చైతన్య

సీతమ్మధార: పారిశుధ్య కార్మికులే నిజమైన ప్రజా సేవకులని జేసీఐ నేరా బై మౌంట్ ప్రెసిడెంట్ బి.చైతన్య రాజీవ్‌కుమార్ అన్నారు. దొండపర్తి, డైమండ్ పార్కు, శంకరమఠం తదితర ప్రాంతాలలో అర్ధరాత్రి చలిలో రహదారులను శుభ్రం చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సత్కరించి, కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జేకాం కోచ్ వి.రాధాకృష్ణ, జేసీఐ డైరెక్టర్ బి.కవిత, కె.ఎం.కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం అశోకనగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఉచితంగా మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్‌లో 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల మహిళలు, యువత దరఖాస్తులు చేసుకోవాలన్నారు మరిన్ని వివరాలకు 96760-30455 నంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నవీన్

సీతంపేట : ఉత్తరాంధ్ర మైగ్రేటెడ్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన నవీన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అంకిత్, సభ్యులు అహ్లాద్, అప్సర్‌ఖాన్, అజ్జి రాజేష్, మణికంఠ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆచార్య భరతలక్ష్మికి జాతీయ పురస్కారం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జువాలజీ విభాగం ఎమెరిటస్ ప్రొఫెసర్ ఆచార్య బి.భరతలక్ష్మికి జాతీయ పురస్కారం లభించింది. జువాలజీ రంగంలో చేసిన కృషి, పరిశోధనలకు గానూ బిస్వామోయ్ బిస్వాస్ గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని ఆమె అందుకున్నారు. జూలాజికల్ సొసైటీ ఈ అవార్డును ఇటీవల ఆమెకు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆచార్య భరతలక్ష్మిని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి బుధవారం అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా


జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ప్రత్యేక అధికారి డాక్టర్ సత్యవేణి


లక్ష్మీనారాయణపురంలో కేస్‌షీట్, మందులు అందజేస్తున్న జీవీఎంసీ ఏఈ ఉమామహేశ్వరరావు

తాటిచెట్లపాలెం : వైఎస్సార్ అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్లతో ఇప్పటికే ప్రజలకు చేరువైన వైద్య సేవలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో మరింత చేరువయ్యాయని నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేనివారు, అవకాశం లేని వారు ఈ శిబిరాల్లో వైద్య సేవలు పొందుతూ, అవసరమైన పరీక్షలు చేయించుకుంటూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ – 1 డాక్టర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం తాటిచెట్లపాలెం 254వ నంబరు సచివాలయం పరిధి నివాసులకు లక్ష్మీనారాయణపురం ఎంఈఎస్ గేట్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 454 మంది వైద్య సేవలందుకున్నారు. వీరిలో ఇద్దరిని ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది, జీవీఎంసీ ఏఈ ఉమా మహేశ్వరరావు, సీవో రమణి, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పైడి నాగరాజు, రాజు యాదవ్, బాబూరావు, ప్రభాకర్‌రావు, నానిబాబు, పోతల శ్రీను, దుర్గ, హరి తదితరులు పాల్గొన్నారు.

382 మందికి వైద్య పరీక్షలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోందని జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ భవానిగార్డెన్స్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో బుధవారం జరిగిన రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జీవీఎంసీ అధికారుల నేతృత్వంలో వైద్యాధికారులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చూడాలనే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అధికారి డీఎస్ఎంవో డాక్టర్ సత్యవేణి ఆరోగ్య సురక్ష శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 382 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి శాంతి, వైద్యులు ఆనంద్, రూప, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

మురళీనగర్: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా అల్లూరి సీతారామరాజు నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో జ్వరాలతో జనం బాధపడుతున్న నేపథ్యంలో ఈ వైద్యశిబిరం ఎంతో ఉపయోగపడిందని శిబిరానికి వచ్చిన ప్రజలు చెప్పారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కేపీ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనగర్ ఫిజీషియన్ డాక్టర్ మహారాజ్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మశ్రీ, దంత వైద్యులు డాక్టర్ అనురాధ, ఆప్తాల్మజిస్టు హుస్సేన్ పాల్గొని పరీక్షలు చేశారు. శిబిరానికి 160మంది హాజరవ్వగా వీరిలో 150మందికి రక్త పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణి చేశారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇళ్ల వద్దకే సేవలందిస్తున్నారు



జగనన్న ప్రభుత్వంలో ఇంటికే వచ్చి సంక్షేమ పథకాలతోపాటు వైద్య సేవలూ అందిస్తున్నారు. గతంలో ఎవరూ మా ఆరోగ్యం కోసం పట్టించుకోలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అవసరమైన పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా ఇస్తుండడం సంతోషకరం.

– ఉమ్మిడి లక్ష్మి, లక్ష్మీనారాయణపురం

మెరుగైన వైద్య సేవలు



మా ఆరోగ్యం కోసం ఇంత శ్రద్ధ తీసుకున్న వారు ఇంతవరకు ఎవరూ లేరు. జగన్ మా కోసం పట్టించుకుంటూ ఇంటికే పింఛన్ నగదు అందిస్తున్నారు. ఇప్పుడు వృద్ధాప్యంలో వున్న మా ఆరోగ్యం కోసం ఇలా మాకు దగ్గర్లోనే మెరుగైన వైద్య సేవలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. వలంటీర్లు, వైద్యులు, సిబ్బంది చక్కగా చూసుకుంటున్నారు.

– పుక్కళ్ల లీలావతి, సింగాలమ్మపురం

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డు పరిధిలో 131 సచివాలయంలో సీతమ్మపేట, గణేష్‌నగర్ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు రూ. 25 లక్షల విలువైన ఆరోగ్యశ్రీ కార్డులు, రూ.5 లక్షల విలువ గల ఆయుష్మాన్ భారత్ కార్డులు, కంటి వెలుగు లబ్ధిదారులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3200లకుపైగా ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల విలువైన వైద్యచికిత్సలు ఉచితంగా పొందేలా సీఎం జగనన్న మేలు చేశారన్నారు. సచివాలయం పరిధిలో 890 మందికి ఆరోగ్యశ్రీ, 700 మందికి ఆయుష్మాన్, 25 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జేసీతో ఉద్యోగుల భేటీ


జేసీ మయూర్ అశోక్‌ను అభినందిస్తున్న జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు

మహారాణిపేట: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.మయూర్ అశోక్‌ను నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జేసీని కలిసిన వారిలో సంఘం సహా అధ్యక్షుడు ఎస్.లోకేశ్వరరావు, నాయకులు ఐ.ఆనంద, ఎస్సార్ రమణ, మౌనిక, నిర్మల, కనకమహాలక్ష్మి, జగత్తులక్ష్మి, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్ట్

సీతమ్మధార : బాలికను నమ్మించి, కిడ్నాప్ చేసిన యువకుడిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తాటిచెట్లపాలెం, ఎస్ఆర్ నగర్, చిట్టిబాబు కాలనీకి చెందిన యువకుడు టి.బంగారరాజు(23) తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నయ్య వద్ద ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను నమ్మించి ఈ నెల 27న రాత్రి విజయవాడలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లిపోయాడు. అక్కడి నుంచి రాజమండ్రి వచ్చి వుండగా... బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టి ఇద్దరినీ విశాఖ తీసుకొచ్చారు. బంగారురాజుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తమిళ సాహిత్యంపై చర్చ


మాట్లాడుతున్న తమిళ కవి దివాకర్

సీతంపేట: తమిళ సాహిత్యంలో తిరుక్కురల్ గ్రంథం చాలా ప్రసిద్ధిచెందినదని ప్రముఖ తమిళ కవి వెంకట్రామన్ దివాకర్ అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన ఇతర భాషా సాహిత్య పరిచయంలో భాగంగా తమిళ కావ్యం తిరుక్కురల్‌పై సాహిత్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు పూర్వం 32వ సంవత్సరంలో కవి తిరువళ్లువార్ రచించారని, ఈ గ్రంథాన్ని 44 భాషల్లోకి వందమంది రచయితలు అనువదించారన్నారు. దీనిలో మానవ జీవితానికి సంబంధించిన 1330 ద్విపదలు ఉన్నాయని, ఈ నాటికి ఉపయోగపడేలా గ్రంథ రచన ఉంటుందన్నారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యస్.విజయ్‌కుమార్, రచయితలు కె.జి.వేణు, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామకృష్ణారావు, రామతాత, తనికెళ్ల సూర్యకళ, పి. భాగ్యమతి, కె.చిన్నయ్య, పి.ఎస్. కుమార్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్లో గేట్ నం.3 వద్ద బుధవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. గవర్నమెంట్ రైల్వేపోలీసులు (జీఆర్పీ) సీఐ ధనుంజయనాడు ఆదేశాల మేరకు ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 60–65 ఏళ్ల వయస్సు గల మగ వ్యక్తి రైల్వే స్టేషన్ గేట్ నం.3 వద్ద మృతిచెందినట్టు కనుగొన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు, కలిగి చామన ఛాయ శరీర రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ వ్యక్తి పింక్ రంగు గల చొక్కా, నీలం, బ్లూ జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఆచూకీ తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ 98664 13487 / 94406 27547 నంబర్లలో తెలియజేయాలని శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్ఐవోగా సత్యనారాయణ సేవలు అమోఘం


సత్యనారాయణను సత్కరిస్తున్న గణేష్, సిబ్బంది

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణ సేవలు అమోఘమని ఆర్ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్ అన్నారు. కార్యాలయ అధికారుల, సిబ్బంది అంతా బుధవారం సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఎంతో అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం


తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, విశ్వనాథన్

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమకూర్చిన నిధులు, దాతలు అందించిన ఆర్థిక సహాయంతో ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని కలెక్టర్ మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ ఆధునికీకరణ పనులు చేపడతామని స్థానిక అధికారులు తెలిపిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యాలయం సిబ్బందితో పాటు ప్రజల కోసం అదనపు వసతులు, హంగులు సమకూర్చినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితోనే అభివృద్ధి ఫలాలు సాధ్యమవుతాయని, ఇందుకు గతంలో ప్రారంభించుకున్న గాజువాక, ప్రస్తుతం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయాలే ఉదాహరణ అన్నారు. ఈ ఆధునిక కార్యాలయం నుంచి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. రానున్నది ఎన్నికల కాలం కావడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి పనితీరు కనబరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, తహసీల్దార్లు ఆనంద్‌కుమార్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్తరంలో 'ఆసరా' సంబరాలు

- నియోజకవర్గంలో 29, 992 మందికి లబ్ధి
- రూ. 28.6 కోట్లు మంజూరు



సీతంపేట: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గురువారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో డీఎల్‌బీ గ్రౌండ్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆసరా సంబరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 17 వార్డుల్లో డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న 29,992 మంది లబ్ధిదారులకు ఆసరా నాలుగో విడత కింద రూ. 28.6 కోట్లు లబ్ధి చేకూరుతుందని కె.కె.రాజు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి వైఎస్సార్ ఆసరా పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. ఈ పథకం కింద 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా సభ్యుల అవుట్ స్టాండింగ్ బ్యాంకు రుణాలను నాలుగు వాయిదాల్లో రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఇచ్చినమాట ప్రకారం వరుసగా నాలుగేళ్లు ఆసరా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి డ్వాక్రా అక్కచెల్లెమ్మలు అండగా నిలవాలన్నారు.

'నందిపిల్లి గురజాడ కన్యాశుల్కం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: రచయిత వృద్ధుల కల్యాణ రామారావు రచించిన సాహిత్య సురభి 'నందిపిల్లి గురజాడ కన్యాశుల్కం' పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఆచార్య వి.బాల మోహన్‌దాస్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త సర్వేశ్వర అవధాని మాట్లాడుతూ 1887లో నందిపిల్లి గ్రామంలో జరిగిన ఒక ముఖ్య సంఘటనకు కన్యాశుల్కం ఆవిర్భావానికి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. బహుశా ఆ సంఘటనే జరగకపోతే కన్యాశుల్కం నాటకం మొదటి కూర్పు పుట్టక పోవచ్చని తెలిపారు. తెలుగు జాతి ఈనాటికి అబ్బురపడే గొప్ప సాంఘిక నాటకం పుట్టడానికి మూలమైన నందిపిల్లిలో జరిగిన ఆ సంఘటన ఏమిటో రచయిత కల్యాణ రామారావు 'నందిపిల్లి గురజాడ కన్యాశుల్కం' పుస్తకంలో పొందుపర్చారన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత వృద్ధుల కళ్యాణ రామారావు, ఆదిభట్ల విద్యాసాగర్, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ


కొండవీధిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కోడిగుడ్ల శ్రీధర్, ఇంజినీరింగ్ విభాగాధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వార్డులో 24/7 పైప్‌లైన్ల కోసం తవ్విన గుంతలు పూడ్చే పనులను ఆయన ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్యామ్ సుందర్, రమేష్, కల్యాణ్, కోటి, ప్రసాద్, ఏఈ సతీష్, కాంట్రాక్టర్ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీల హక్కులు కాపాడాలని వినతి


జీఎం మనోజ్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న పెదిరెడ్ల రాజశేఖర్

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఓబీసీ ఉద్యోగుల హక్కులు కాపాడాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మకు ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ విజ్ఞప్తి చేసారు. విశాఖపట్నం విచ్చేసిన జీఎంను డివిజనల్ కార్యాలయంలో బుధవారం కలిశారు. పార్లమెంట్ చట్టాల ద్వారా సాధించుకున్న ఓబీసీ హక్కులను కార్మికులకు కల్పించి తగిన గుర్తింపునివ్వాలని కోరారు. ముఖ్యంగా వాల్తేర్ డివిజన్‌లో ఓబీసీ కార్మికులకు ప్రభుత్వం కల్పించిన సంక్షేమ ఫలాలు అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతోపాటు జి.నాగరాజు, వి.జయరామ, రవి, విశ్వేశ్వరరావు ఉన్నారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సీతమ్మధార : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన డైరీని జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ బుధవారం ఆవిష్కరించారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డైరీ ఆవిష్కరించారు. ఉమ్మడి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, సంఘం జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు, కార్యదర్శి దేవరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు జైభారత్‌నగర్‌కు చెందిన పి.రేవతి కుమారుడికి ఇటీవల బెంగళూరులోని సత్యసాయి ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. మళ్లీ స్వెల్లింగ్ రావడంతో స్థానిక వైద్యులకు చూపించారు. బెంగళూరులో సర్జరీ చేసిన ఆస్పత్రికే మళ్లీ తీసుకెళ్లాలని సూచించారు. సమస్యను వైఎస్సార్‌సీపీ నాయకులు రుత్తుల రాంబాబు, దాడి చిన్నారావ్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు బుధవారం 276 సచివాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు కర్రి రమారెడ్డి చేతుల మీదుగా బెంగళూరు వెళ్లేందుకు రూ.5వేలు రేవతికి అందజేశారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్, సాయి, లక్ష్మి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.